క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: స్థానిక స్పెషల్ స్కూల్, 3వ అంగన్‌వాడి కేంద్రాన్ని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. స్పెషల్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 1, 2 తరగతుల్లో కేవలం 4 మాత్రమే ఉండడంతో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. ఈయన వెంట గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంటు వున్నారు.

జీవిత బీమాను సద్వినియోగం చేసుకోండి

శిరివెళ్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస శర్మ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకాలు అమలులో ఉన్నాయన్నారు. అటల్ పెన్షన్ యోజనలో చందాదారులుగా చేరవచ్చన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యులు రాక

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి నంద్యాలకు రానున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి లీలావతి దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో బాలల హక్కులు, బాల్య వివాహాలపై గిరిజన, బీసీ, సాంఘిక వసతి గృహ అధికారులు, సహాయ వసతి గృహ అధికారులు, సీడీపీఓలు, డీసీపీఓ, డీసీపీయూ సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

73 కొత్త పింఛన్లు మంజూరు

గోస్పాడు: మండలానికి 73 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ అమానుల్లా తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్పౌస్ కింద పింఛనులను మంజూరు చేసిందన్నారు.. గోస్పాడులో 14, జిల్లెల్లలో 11, జులేపల్లి, పసురపాడులో 9 చొప్పున, దీబగుంట్ల, ఎం.కృష్ణాపురంలో ఒక్కొక్కటి చొప్పున, సాంబవరం, కానాలపల్లిలో రెండు చొప్పున, ఒంటి వెలగల 5, యాళ్లూరు–1లో 12, యాళూరులో 3 చొప్పున కొత్త పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు.

ముగ్గురికి ట్రిపుల్ ఐటీలో సీటు



లలిత ప్రియ



హరిత

రుద్రవరం: తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరావు గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన సాయితేజ యాదవ్‌కు మొదట ట్రిపుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌లో సీటు రాగా ప్రస్తుతం లలిత ప్రియ, హరితకు అదే క్యాంపస్‌లోనే సీట్లు వచ్చాయన్నారు. ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు.

రేపటి నుంచి యోగాసన పోటీలు

దొర్నిపాడు: నంద్యాలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నుంచి జిల్లా స్థాయి యోగాసనా పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగాసనా జిల్లా కార్యదర్శులు అబ్దుల్ రహమాన్, శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 10–50 ఏళ్ల వారు మహిళలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. ట్రెడిషనల్ యోగ, ఫార్వర్డ్ బెండ్, బ్యాక్ బెండ్, ట్విస్ట్, లెక్‌బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, సుపినే, కళాత్మక సింగల్, కళాత్మక ఫెయిర్, తాళాత్మక ఫెయిర్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదనపు సమాచారం కోసం 97033 20383, 9398931071ను సంప్రదించాలన్నారు.

పారదర్శకంగా పింఛన్ల పంపిణీకి చర్యలు

ఉయ్యాలవాడ: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గురువారం స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలలో పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారుల గృహాల వద్దకు వెళ్లి నూతనంగా విధుల్లో చేరిన సచివాలయ ఉద్యోగుల ద్వారా పరిచయ కార్యక్రమాన్ని చేపట్టారు. వీరి వెంట సర్పంచ్ మేకల ఓబులేస్, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డిలు పాల్గొన్నారు.

అదృష్టం వరించేనా!

ఉయ్యాలవాడ: ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వం నిర్లక్ష్యంతో గతేడాది నష్టాలు మూటగట్టుకున్న వరి రైతుకు ఈ ఏడాదైనా అదృష్టం వరించేనా అనే ఆందోళన వెంటాడుతోంది. వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా ఆ పరిస్థితి లేదు. ఇప్పటి వరకు పెట్టుబడి భరోసా ఇవ్వలేదు. ఖరీఫ్ ఆరంభంలోనే ఎరువుల సరఫరాలో చేతులెత్తేసింది. ఈ క్రమంలో కుందూ తీర ప్రాంతంలో ఉన్న 14 గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో భాగంగా కోటి ఆశలతో వరి సాగులో నిమగ్నమయ్యారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు, వరుస తుపాన్ల ప్రభావంతో దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు మాత్రమే వచ్చాయి. ఇదే సమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించ లేదు. 70 కిలోల బస్తా రూ. 1,100 నుంచి రూ. 11,50 లోపు విక్రయించు కోవాల్సి వచ్చింది. పెట్టుబడులు కూడా చేతికి అందలేదు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు వరుణుడు మొఖం చాటు వేశాడు. దీంతో మరో సారి అన్నదాతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ నష్టాన్ని పూడ్చుకునేందుకు వరి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సాధారణ సాగు విస్తీర్ణం 1080 హెక్టార్లు కాగా ఈ ఏడాది 1200 హెక్టార్ల వరకు సాగయ్యే అవకాశం వుందని వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు.



వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు



రూపనగుడిలో ట్రాక్టర్ ట్రిల్లర్ కొడుతున్న రైతు



మాయలూరులో నారుమడి సిద్ధం చేస్తూ..

రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నంద్యాల: అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ మేరకు రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం సీఎం చంద్రబాబునాయుడు అమరావతి సచివాలయం నుంచి అన్నదాత సుఖీభవ పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసిలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పథకానికి సంబంధించి నంద్యాల జిల్లాలో 2.07 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతలో 5వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద 2వేలు, మొత్తం కలిపి ఒక్కొక్క రైతుకు రూ.7వేలు రైతుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకానికి సంబంధించి రైతుల నుంచి ఎటువంటి వ్యతిరేకత తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో వరి పంటలకు సంబంధించి రైతులందరూ పంటల బీమా ఆగస్టు 15 తేదీ లోపల మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు.

కామేశ్వరీదేవికి గాజుల మాలలు సిద్ధం



గాజులతో మాలలు చేస్తున్న మహిళలు

మహానంది: శ్రావణమాసం, రెండో శుక్రవారం సందర్భంగా మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి అమ్మవారికి గాజులతో అలంకరణ చేయనున్నారు. స్థానిక మహిళలు గురువారం పదివేలకు పైగా గాజులతో అమ్మవారి కోసం మాలలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. భక్తిగీతాలను ఆలపిస్తూ భక్తిశ్రద్ధలతో మాలలు తయారు చేస్తున్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తొలిసారి శ్రావణమాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారికి వివిధ రకాల అలంకరణ పూజలు చేయనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

గండికోటకు నీరు విడుదల



చెర్లోపల్లె హెడ్‌రెగ్యులేటర్ నుంచి గండికోటకు నీటిని విడుదల చేసిన దృశ్యం

అవుకు: పట్టణ శివారులోని రిజర్వాయర్ నుంచి గండికోట రిజర్వాయర్‌కు గురువారం అధికారులు నీటిని విడుదల చేశారు. జమ్ములమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎస్.ఈ రవికిరణ్ అవుకు సమీపంలోని చెర్లోపల్లె హెడ్‌రెగ్యులేటర్‌కు చెందిన నాలుగు గేట్లను ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అవుకు రిజర్వాయర్‌కు జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 13,500 క్యూసెక్కుల వరద నీరు, ఎస్సార్బీసీ కాలువ ద్వారా 545 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని, ఇందులో పంటల సాగుకు ఎస్సార్బీసీ కాలువకు 300 క్యూసెక్కులు, గండికోటకు 3వేల క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.92 టీఎంసీ నీటి నిల్వ ఉందని చెప్పారు. కార్యక్రమంలో అవుకు, జమ్ములమడుగు ఈఈ లు సుభకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏఈ లేక.. నిధులు మంజూరు కాక!

- అభివృద్ధికి నోచుకోని చెరువులు
- గతేడాది ఆగస్టు నుంచి మైనర్ ఇరిగేషన్‌లో ఏఈ సీటు ఖాళీ



బనగానపల్లెలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

బనగానపల్లె : బనగానపల్లె, అవుకు మండలాలకు చెందిన బనగానపల్లె సెక్షన్ మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో 8 నెలలుగా రెగ్యులర్ ఏఈ లేనందున చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు కావడం లేదు. దీంతో చెరువులు.. ఆయకట్టు రైతులు, ప్రజలకు ఉపయోపగపడటం లేదు. చాలా వరకు నిరుపయోగంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ పని చేస్తున్న రెగ్యులర్ ఏఈని గతేడాది ఆగస్టులో శిరివెళ్ల సెక్షన్‌కు బదిలీ చేయగా, కోవెలకుంట్ల మైనర్ ఇరిగేషన్ కార్యాలయానికి చెందిన ఏఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కోవెలకుంట్ల సెక్షన్ పరిధిలో కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల మండలాలలు ఉన్నందున ఈ అధికారికి బనగానపల్లె సెక్షన్ పరిధిలోని బనగానపల్లె, అవుకు మండలాల్లోని చెరువులు, కుంటల పర్యవేక్షణ బాధ్యతను నిర్వహించలేకపోతున్నారు. ప్రధానంగా బనగానపల్లె మండలంలోని 1,513 ఎకరాల ఆయకట్టు కలిగిన మీడియం ఇరిగేషన్ దద్దణాల ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను వర్షా కాలంలో నిర్వహించాల్సి ఉంది. బనగానపల్లె సెక్షన్ పరిధిలోని చెరువులు, కుంటలు అధిక శాతం చాలా కాలంగా ఆక్రమణలకు గురవుతున్నందున అవి ఉనికిని కోల్పోతున్నాయి. దీంతో వీటిని కాపాడాల్సిన బాధ్యత ఏఈపై ఉంటుంది. రెగ్యులర్ ఏఈ లేనందున పర్యవేక్షణ పర్యవేక్షణ కొరవడిందని ఇక్కడి రైతుల, ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు బనగానపల్లె మైనర్ ఇరిగేషన్ కార్యాలయానికి రెగ్యులర్ ఏఈని నియమించాలని కోరుతున్నారు.

వడ్డెర సొసైటీలకు రుణాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని వడ్డెర సొసైటీలకు రుణాలు మంజూరు చేసి బలోపేతం అయ్యేలా చూడాలని అఖిల భారత వడ్డెర సంఘం కార్యదర్శి శిల్పసుబ్బరాయుడు కోరారు. వడ్డెరులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వందలాది వడ్డెర సొసైటీలు ఉన్నాయన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నోఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, రామకృష్ణ, మధు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రైలు స్టాపింగ్‌పై హర్షం




స్టేషన్‌మాస్టర్‌ను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: నంద్యాల– యర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రతి రోజు నడుస్తున్న గుంటూరు– తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు స్టేషన్లలో స్టాపింగ్‌కు దక్షిణ మధ్య రైల్వేశాఖ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కోవెలకుంట్ల రైల్వే స్టేషన్ చేరుకుని స్టేషన్ మాస్టర్ గురుచరణ్‌ను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు కరీంబాషా, సుధాకర్ మాట్లాడుతూ ఈ మార్గంలో రోజూ గుంటూరు నుంచి కోవెలకుంట్ల మీదుగా తిరుపతికి ఒక రైలు, తిరుపతి నుంచి గుంటూరుకు మరో రైలు నడుస్తోందన్నారు. నెల నుంచి స్టాపింగ్ లేకపోవడంతో కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, గోస్పాడు, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన ప్రజలు తిరుపతి, గుంటూరు, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిచేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. రైల్వే శాఖ శనివారం నుంచి ఆరు నెలల పాటు కోవెలకుంట్ల, వైఎస్సార్ జిల్లా జమ్ములమడుగు స్టేషన్లలో స్టాపింగ్‌కు అనుమతి ఇవ్వడం శుభపరిణామమన్నారు. నాయకులు గడ్డం రామకృష్ణారెడ్డి, వడ్డే సుబ్బరాయుడు, లింగన్న, షమీన్, రామచంద్రరాజు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

ప్యాపిలి: నల్లమేకలపల్లి గ్రామం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేని ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జలదుర్గం ఎస్ఐ నాగార్జున తెలిపారు.

ఎన్‌జీఓ నేతకు ఘనంగా వీడ్కోలు



వెంగళ్ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న జిల్లా ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడిగా వీసీహెచ్ వెంగళ్ రెడ్డి అందించిన సేవలు ఎనలేనివని జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నేతలు కొనియాడారు. జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న వెంగళ్ రెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏపీ టీఎస్ఏ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ట్రెజరీ అధికారులు, ఉద్యోగులు ఆయన సేవలను ప్రశంసించారు. జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు, ఏపీజీఎల్ఐ జేడీ కృష్ణ, లోకల్ ఫండ్ ఆడిట్ అధికారి రమేష్ బాబు మాట్లాడుతూ.. వెంగళ్ రెడ్డి ట్రెజరీ ఉద్యోగులకే కాకుండా అన్ని శాఖల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు సేవలు అందించి వారి హృదయాల్లో స్థిరంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వెంగళ్ రెడ్డి దంపతులను ట్రెజరీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. సన్మాన గ్రహీత వెంగళ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లుగా ఎన్‌జీఓ అసోసియేషన్ నేతగా నిస్వార్థంగా సేవలు అందించినట్లు చెప్పారు. ఏపీ టీఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, గురుమూర్తి, ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వేతన సమస్యను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయరావు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల వేతనాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విజయరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బదిలీలు జరిగి రెండు నెలలు అయినా ఇప్పటి వరకు జీతాల సమస్యలు పరిష్కారం కాక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చేంత వరకు వివిధ కేడర్లలో పోస్టులను ఉమ్మడి సీనియారిటీగా ఇవ్వాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి పోస్టులను ప్రభుత్వ ఎగ్జామ్ స్కూల్ అసిస్టెంట్లతో కాకుండా పంచాయతీరాజ్ యాజమాన్యంలోని వారికే ఇవ్వాలని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకు ఆగస్టు 2వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, మౌలాలి, గోపాలకృష్ణ, సాంబశివుడులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 2న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీ 4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదన్నారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్నత అసమ్మతిని తొలగించాలని కోరారు. 72, 73, 74 జీవోలు అమలు చేయాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకం చేపట్టి యథాతథంగా కొనసాగించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఈఓ–1 పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పుల్లయ్య, లక్ష్మణ్‌నాయక్, రామకృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ బాక్సింగ్ విజేతలను నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నాయకులు చైర్మన్ డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి ఫయాజ్‌లు గురువారం అభినందించారు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు నేపాల్‌లోని పోఖారాలో జరిగిన 5వ ఇండో నేపాల్ అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 మంది బాక్సర్లు వివిధ కేటగిరిల్లో బంగారు పతకాలు సాధించినట్లు నంద్యాల బాక్సింగ్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. ఏపీ క్రీడాకారులు విజేతలుగా నిలవడంలో విశేష కృషి చేసిన బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్, కోచ్ ఆనందచారిలను ప్రత్యేకంగా అభినందించారు. నంద్యాల జిల్లాలో కూడా బాక్సింగ్ క్రీడాభివృద్ధికి విద్యార్థుల్లో, యువతలో బాక్సింగ్ క్రీడ పట్ల ఆసక్తి పెంచడానికి శిక్షణా శిబిరాలు టోర్నమెంట్‌లో నిర్వహిస్తామని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులు మహేష్, వంశీ, జగదీష్, ప్రసాదనాయక్, తిరుమలేష్, సీనియర్, జూనియర్ విభాగాల్లో జశ్వంత్, విష్ణు, సిద్ధార్థ, చరణ్‌తేజ, కల్యాణ్‌కృష్ణను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు, రంగనాథ్, సర్దార్‌ఖాన్‌లు క్రీడాకారులను అభినందించారు.

ఆవుల తరలింపును అడ్డుకున్న స్థానికులు



గోవులను తరలిస్తున్న కంటైనర్

ఆత్మకూరురూరల్: పట్టణంలోని సంగమేశ్వర సర్కిల్ వద్ద ఆవులను తరలిస్తున్న వాహనాన్ని స్థానికులు గురువారం అడ్డుకున్నారు. ఆవులను కబేళాకు తరలిస్తున్నారన్న అనుమానంతో స్థానికులు వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా వాహనంలో పెద్ద సంఖ్యలో ఆవులను కుక్కి తరలిస్తుండటంతో ఒక దూడ మరణించింది. దీంతో ఆవుల కంటైనర్‌ను స్థానికులు సీఐ రాముకు అప్పగించారు.

వ్యక్తిపై దాడి

కోవెలకుంట్ల: స్థానిక సంతమార్కెట్ సమీపంలో ఓ వ్యక్తిపై గురువారం కొందరు దాడికి పాల్పడినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఇంటి పారు విషయంలో రెండు కుటుంబాలు ఘర్షణకు దిగగా రఘురామిరెడ్డి అనే వ్యక్తిపై రామిరెడ్డితోపాటు కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అలరించిన భక్తిరంజని

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై తెనాలికి చెందిన ఎస్. వరలక్ష్మీ కల్యాణి వారి భక్తిరంజని కార్యక్రమం అలరించింది. శరణు గజముఖ, శ్రీశైల శివమయం, లింగాష్టకం, బిల్వాష్టకం, శివ తాండవస్తోత్రం, కాలభైరవాష్టకం, పలు శివకీర్తనలను నేరేళ్ళ వరలక్ష్మీ కల్యాణి, నాగమణి, అనురాధ తదితరులు ఆలపించారు. అలాగే నెల్లూరుకు చెందిన మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

కోలుకోలేక యువకుడి మృతి

బేతంచెర్ల: రోడ్డుప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బైనపల్లెకు చెందిన మణివర్ధన్ (23) కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. సాలమ్మ కుమారుడు మణివర్ధన్ చౌడేశ్వరి అమ్మవారి సేవకు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా పట్టణ సమీపంలో ఆటోఢీ కొంది. ప్రమాదంలో మణివర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించి ఫలితం లేకపోయింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.





బిల్లలాపురం గ్రామం బీసీ కాలనీ రహదారిలో నిలిచిన మురుగునీరు, చాబోలు గ్రామ సర్పంచ్ మౌనిక ఇంటి సమీపంలో గుంతల్లో నిలిచిన వర్షపునీరు

పల్లెల్లో పారి‘చోద్యం’

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వంలో ప్రచారాం ఆర్బాటం.. పనులు నామమాత్రమేనని చెప్పవచ్చు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర అంటూ ప్రతి వారం ఏదో కార్యక్రమం చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారే కానీ పల్లెల్లో మాత్రం పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులతో కలిసి ప్రతి శుక్రవారం పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని నిబంధన ఉన్నాక్షేత్ర స్థాయిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. మండలంలో అయ్యలూరు గ్రామంలో కాలువలు లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు నిలిచి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. బిల్లలాపురం బీసీ కాలనీ, దర్గా సమీపాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లపై నిలిచి పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదువుతున్నాయి. చాబోలు గ్రామంలో గ్రామ సర్పంచ్ మౌనిక ఇంటి సమీపంలో రహదారిలో నిలిచిన వర్షపునీరు కుంటను తలపిస్తుంది. పెద్దకొట్టాల గ్రామంలో గ్రామ చావిడి నుంచి పశువైద్య శాల వరకు డ్రైనేజీ కాల్వ లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు రహారుల వెంట ప్రవహిస్తుంది. చాపిరేవుల గ్రామ ప్రధాన రహదారి మారెమ్మ దేవాలయ సమీపం నుంచి రామాలయం వరకు డ్రైనేజీ కాల్వలు లేకపోవడంతో చిన్నపాటి సెల ఏరులా ఇళ్లలోని మురునీరు ప్రశమిస్తూ వాహనదారులు, స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తుంది. మండల మేజర్ పంచాయతీ కానాల గ్రామంలో స్థానిక మసీదు సమీపంలోని డ్రైనేజీ కాల్వలో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచి పోతుండటంతో స్థానికులు దుర్వాసనలతో ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది రోగాలలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లోని రహదారులపై మురుగు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు కాలువలు నిర్మించి పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టాలని పల్లెవాసులు కోరుతున్నారు.